


## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## *(గత సంచిక తరువాయి)*

మర్నాడు ఉదయం నిద్రలేచేసరికి ఎంతో ఫ్రెష్‌గా ఉంది బెనర్జీకి. కానీ తనకి పిల్లలు పుట్టే యోగ్యత లేదన్న బాధ తాలూకు స్పందన ఏమాత్రం తగ్గలేదు. తన భర్త ఎంతో ముభావంగా ఉన్నాడని గుర్తించింది అనసూయ. తమ పెళ్ళయ్యాక అతనింత ముభావంగా ఉండటం అదే మొదటిసారి.

అతన్ని రెండు మూడుసార్లు పలకరించింది.

"రాత్రికి త్వరగా వస్తారా? మీ కిష్టమైన పెసరపచ్చడి చెయ్యనా?" అడిగింది.

"వద్దులే" అన్యమనస్కంగా జవాబు చెప్పాడతను.

"బ్లూ సూట్ వేసుకుంటారా లేదా వైటా?"

"ఏదో ఒకటివ్వు."

"మీరిప్పుడు అచ్చం 'రోమన్ హాలీడే'లో గ్రెగరీ పెక్‌లా ఉన్నారు."

"నువ్వు రోమ్ ఎప్పుడు వెళ్ళావు?" పరధ్యానంగా అడిగాడు.

"రోమ్ వెళ్ళడం ఏమిటి?"

కాసేపాగి అడిగింది అనసూయ.

"ఇవాళేమైంది మీకు?"

"ఏమైనా అయిందనిపిస్తున్నానా?"

"ఎంతో పరధ్యానంగా ఉన్నారు."

జవాబు చెప్పకుండా కారు పోనించాడు బెనర్జీ. కొద్దిసేపు అమృత ఫుడ్స్ గురించి ఆలోచించాడు. తనకి సమీప పోటీదారులు వాళ్ళే వాళ్ళని ఎలాగయినా ఈ సంవత్సరం సేల్స్‌లో అధిగమించాలి. ఆ తర్వాత..

అతని ఆలోచన వద్దనుకున్నా మళ్ళీ మైత్రి మీదకి వచ్చింది అతను పళ్ళు పటపట కొరికాడు. గర్భం వచ్చిందని అబద్దం ఆడిందానాడు. తను అబార్షన్‌కి అన్ని ఏర్పాట్లు చేసినా పారిపోయింది. తను అప్పట్లో పుట్టబోయే బిడ్డకోసం పారిపోయిందనుకున్నాడు కాని పారిపోలేదు. తన పద్ధతి అమ్మాయిల చేతికి డబ్బు ఇవ్వకపోవడం. కావల్సిన ఏర్పాట్లన్నీ చేయడం.

ఏదో ఆలోచన రావడంతో కారుని స్లో చేసి చేతి గడియారం వంక చూసుకున్నాడు. మైత్రి ఇంకా ఫేక్టరీకి బయలుదేరి ఉండదు. తన కోపాన్ని తీర్చుకోవాలి. అది ఫేక్టరీలోకంటే బయటయితేనే బెటర్.

సింహాచలాన్ని మైత్రి ఎక్కడ ఉంటోందో కనుక్కోమని అడగడం మంచిదయింది. ఆయన చెప్పిన ఎడ్రస్‌ని గుర్తుతెచ్చుకున్నాడు. కారుని వెనక్కి తిప్పి మరోవైపు పోనిచ్చాడు బెనర్జీ.

మైత్రి కనబడగానే తనని మోసం చేసినందుకు తిట్టాలి. వీలయితే కొట్టాలి. మెడ పట్టుకుని వంచి వీపు మీద గబగబ..

స్టీరింగ్ చుట్టూ బెనర్జీ వేళ్ళు కోపంతో బిగుసుకున్నాయి. ఎంత మంది చేత తను మోసపోయాడు? ఈ ఆడవాళ్ళంతా..

"యూ బిచ్" తనని తను కంట్రోల్ చేసుకోలేక కోపంగా అరిచాడు బెనర్జీ.

## 7

"బ్రేక్ ఫాస్ట్ రెడీ" చెప్పింది మైత్రి పల్చటి ప్లాస్టిక్ కవరు పరిచిన ఫోల్డింగ్ గాడ్రేజ్ టేబుల్ మీద గిన్నె ఉంచి.

శ్యామలాంబ మైత్రివంక ఆప్యాయంగా చూసి చెప్పింది.

"నిన్నెలా మెచ్చుకోవాలో తెలీటంలేదు. పేరుకి మా ఇంట్లో పేయింగ్ గెస్ట్ గాని వంటపని నువ్వే చేస్తున్నావ్. ఇదివరకున్న అమ్మాయి గదిలోంచి బయటకి వచ్చేదే కాదు."

"కొందరు కలివిడిగా ఉంటే మరి కొందరు రిజర్వ్‌డ్‌గా ఉంటారు. వాళ్ళ వాళ్ళ మనస్తత్వాలు. అట్టే మెచ్చుకోకండి. తల పొగరు ఎక్కొచ్చు" నవ్వింది మైత్రి.

"అమ్మా! ప్రోగ్రెస్ కార్డు మీద సంతకం చేయమని ఇచ్చింది మిస్" ఆరేళ్ళ సుధీర్ మైత్రికి ఎర్రటి కార్డుని స్కూల్‌బేగ్‌లోంచి తీసిచ్చి చెప్పాడు.

సుధీర్ మొహంలోని భావాలని గమనించి అడిగింది మైత్రి.

"నిన్న స్కూల్ నుంచి రాగానే ఇవ్వచ్చుగా? ఇంతాలస్యం చేసావే?"

బదులుగా తలవంచుకున్నాడు.

"ఏమిటి? ఏ రేంక్ వచ్చింది?"

జవాబు చెప్పలేదు సుధీర్.

"ఓహో! ఇందుకన్నమాట దొరగారు దీన్ని లాస్ట్ మినిట్ లో ఇచ్చింది. ప్లేస్ మారాక చదువు మీద శ్రద్ధ తగ్గిందా?"

కోపంగా కార్డు తెరిచి చూసింది. సుధీర్‌కి ఫస్ట్ రేంక్ వచ్చింది.

"ఎప్పటిలానే ఫస్ట్ రాంకే" చెప్పింది ఆనందంగా.

సుధీర్ వెంటనే రెండు పెదవులని మూసి బుగ్గలని ఎక్స్‌పేండ్ చేసి రెండు గుప్పిళ్ళతో బుగ్గలమీద ముద్దుపెట్టుకుంది మైత్రి.

"వెరీగుడ్ బాయ్"

"నేను భలే లక్కీ మమ్మీ కదా?" అడిగాడు.

మైత్రి ప్రోగ్రెస్ కార్డ్ మీద సంతకం చేసి చెప్పింది.

"నువ్వు ఎంత బాగా కష్టపడితే జీవితంలో నీకు అంత అదృష్టం లభిస్తుంది."

కైలాసం వంట గదిలోని పూజ గూడు ముందునుంచి లేచి పట్టుపంచె మార్చుకుని వచ్చి కూర్చున్నాడు.

"అమ్మాయ్! బ్రెడ్ టోస్ట్ మాత్రం భలే బాగా చేస్తావ్" చెప్పాడాయన తన ప్లేట్‌లోని పదార్ధాన్ని చూడగానే.

నలుగురూ తినబోతూండగా కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తెరిచింది మైత్రి.

ఎదురుగా బెనర్జీ. వెంటనే మైత్రి మొహంలో రంగులు మారాయి.

"ఎందుకొచ్చారు?" అడిగింది.

"నువ్వెంత పచ్చి బజారు దానివో తెలిసింది కనుక" కోపంతో ఊగిపోతూ అన్నాడు.

"దయచేసి వెళ్ళిపోండి"

తలుపు వేయబోతుంటే చెయ్యి అడ్డం పెట్టి ఆపాడు బెనర్జీ.

"మాట్లాడాలని వచ్చాను."

మైత్రి గమనించింది అతని మొహంలో ప్రస్ఫుటంగా కనబడే తీవ్రమయిన కోపం. కైలాసం లేచి మైత్రి దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"ఎవరమ్మా అతను?"

"మా బాస్" చెప్పింది మైత్రి.

అప్పటికే మైత్రి మొహం అవమానం వల్ల కలిగే సిగ్గుతో ఎర్రబడింది.

" 'భర్త' అన్న విషయం దాచావే?" అడిగాడు ఎకసెక్కంగా చూస్తూ.

"మిస్టర్ బెనర్జీ. ఐ వార్న్‌యు. ఇక్కడ గొడవ చేయడానికి వస్తే మాత్రం దయచేసి వెళ్ళిపొండి" చెప్పింది.

"గొడవ కాదు. నిన్ను చంపడానికి వచ్చాను" మైత్రిని బలంగా లోపలికి నెట్టి తలుపుదాటి లోపలకి వచ్చాడు బెనర్జీ.

సుధీర్ కుర్చీలోంచి భయంగా లేచి నిలబడ్డాడు అతన్ని చూడగానే. మైత్రి అతనికి దూరంగా జరిగింది.

"యూ ఆర్ ఏ బిచ్"

ఒక్కొక్క అడుగే ఆమెవైపు వేస్తూ కసిగా చెప్పాడు.

"స్టాప్ దిస్ మేడ్‌నెస్ ఐ సే" అరిచింది మైత్రి.

"నా వల్ల నీకు గర్భం వచ్చిందేం? అలా అని చెప్పి ఎంత డబ్బు గుంజాలనుకున్నావ్?"

"వెయిట్ ఏ మినిట్" అరిచింది మైత్రి.

కైలాసం, శ్యామలాంబ చేష్టలుడిగినవాళ్ళలా చూస్తూండిపోయారు. ముందర తేరుకున్న కైలాసం బెనర్జీ షర్ట్ అంచు పట్టుకుని ఆపి చెప్పాడు.

"ఏ అబ్బాయ్? ఎవరు నువ్వు? మా ఇంటికొచ్చి ఏమిటీ దౌర్జన్యం?"

బెనర్జీ ఆయనవంక చూడనయినా చూడకుండా పక్కకి తోసాడు. సుధీర్ చేతులు భయంగా కుర్చీ కోడుని పట్టుకున్నాయి.

మైత్రి మెడచుట్టూ రెండు చేతులు వేసి బలంగా నొక్కుతూ చెప్పాడు బెనర్జీ.

"చెప్పు నిజం చెప్పు. నా వల్ల నీకు గర్భం వచ్చిందా? రాలేదు. ఎందుకబద్ధం ఆడావ్?"

"పిల్లని చంపేస్తున్నావ్" అరిచింది శ్యామలాంబ ఉద్వేగంగా దగ్గరికి గెంతి చేతులు విడదీయాలని ప్రయత్నిస్తూ.

"ఏమండీ. మీరు వచ్చి విడిపించండి" అరిచింది.

మైత్రి మెడచుట్టూ బెనర్జీ చేతులు మరింతగా బిగుసుకున్నాయి. అతనిలోని పైశాచికత్వం అంతా అతని మొహంలో కనిపించింది.

"కమాన్. స్పీకప్ బి ఫోర్ యు డై సే సమ్ థింగ్" బెనర్జీ ఆవేశంతో వ్మకర తిరిగిన నోటితో చెప్పాడు.

సుధీర్ గట్టిగా అరిచాడు.

"అమ్మా!"

ఒక్క గెంతులో వాళ్ళ దగ్గరకి దూకి భుజాన వేలాడే పుస్తకాల సంచితో బెనర్జీని బాదుతూ చెప్పాడు ఆవేశంగా.

"వదులు మా అమ్మని వదులు" ఆ మాటలకి బెనర్జీ షాక్ తిన్నవాడిలా మైత్రి మెడని వదిలేసాడు. కళ్ళు దించి ఆ కుర్రాడి వంక చూసాడు.

కోపంతో, దుఃఖంతో ఏడుపు వచ్చేసింది సుధీర్‌కి. ఏడుస్తూ కోపంగా ఇంకా బెనర్జీని బాదుతూనే అరవసాగాడు.

"వదులు మా అమ్మని వదులు. మా అమ్మని వదులు" తర్వాత మైత్రిని చుట్టేశాడు సుధీర్. మైత్రి సుధీర్ తలమీది జుట్టుని చేతి వేళ్ళతో సవరిస్తూ చెప్పింది.

"ఊర్కో సుధీర్. ఊర్కో"

బెనర్జీ కళ్ళలో ఆశ్చర్యం. ఆమె వంక చూసాడు. మైత్రి రెప్పవాల్చకుండా అతని కళ్ళలోకి చూసింది. కొన్ని క్షణాల తర్వాత ఆ చూపుని భరించలేక బెనర్జీ కళ్ళు తిప్పుకున్నాడు. వెంటనే ఏం చేయాలో తోచలేదతనికి. జేబులోంచి సిగరెట్ పెట్టెని తీసి చటుక్కున ఓ సిగరెట్ వెలిగించి కిటికీ దగ్గరకి వెళ్ళిపోయాడు.

మైత్రి చేత్తో తన మెడని రాసుకుంది. తర్వాత ఏం జరగనట్లే సుధీర్‌ని

"సుధీర్ అంటే?" అడిగింది మైత్రి.

"మంచి ధైర్యంగలవాడు"

"మంచి ధైర్యం గల వాళ్ళెక్కడయినా ఏడుస్తారా?"

నవ్వుతూ అడిగిన ఆమె కంఠంలో కొద్దిగా కాఠిన్యం - పిల్లల్ని క్రమశిక్షణలో పెంచడానికి తల్లి ఉపయోగించేలాంటి కాఠిన్యం ఉంది.

సుధీర్ జేబులోంచి చేతిరుమాల తీసి కళ్ళు తుడుచుకున్నాడు. మైత్రి బెనర్జీ వంక చూసింది. కిటికీలోంచి బయటకి చూస్తూ, ఏం చేయాలో పాలుపోనివాడులా సిగరెట్ తాగుతూ చూస్తున్నాడు.

మైత్రి తన గది తలుపు తెరిచింది.

"లోపల కూర్చోండి. జస్ట్ ఫైవ్ మినిట్స్" చెప్పింది.

"నేను వెళతాను" చెప్పాడు బెనర్జీ సిగరెట్ కిటికీలోంచి బయటకి విసిరేసి.

"మీతో మాట్లాడాలి కూర్చోండి" చెప్పింది.

"యూ ఆర్ స్టిల్ ఏ బిచ్ - నీకా కొడుకు ఎవరివల్ల..?"

"షటప్" అరిచింది మైత్రి.

ఠక్కున ఎవరో చేత్తో నోరు మూసేసినట్లుగా మాట్లాడటం ఆపేసాడు బెనర్జీ.

"ఆ విషయమే మీతో మాట్లాడాలన్నది. కూర్చోండి"

"మాట్లాడేదేముంది? అబార్షన్ చేయించుకోలేదంటావు. అంతేగా? వెళతాను."

తలుపు దగ్గరకు వెళ్ళాడు.

"సుధీర్ మీ కొడుకు" చెప్పింది రహస్యంగా. "అంతేకాదు డాక్టర్ దేవ్‌సేన్ నిన్న మీకిచ్చిన రిపోర్ట్‌లోని విషయం కూడా యదార్థమే"

దేవ్‌సేన్ పేరు వినగానే ఆగాడు. తలతిప్పి మైత్రి మొహంలోకి ఆశ్చర్యంగా చూసాడు.

"కూర్చోండి"

మైత్రి టేబుల్ దగ్గరకి వెళ్ళింది. బెనర్జీ కొద్దిసేపు సంశయించి మైత్రి గదిలోకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. సుధీర్ బ్రేక్ ఫాస్ట్ తింటూ అడిగాడు.

"ఎవరమ్మా ఆయన?"

మైత్రి క్షణకాలం సంశయించి చెప్పింది.

"ఓ గెస్ట్"

మరోసారి సిగరెట్ వెలిగించి దాన్ని కాలుస్తూ ఆ గదిని పరిశీలనగా చూసాడు. గదిలో ఓ మూల పూలకుండీ, అందులో తాజాగా కోసిన అనేక రకాల పువ్వులు. విండో సెల్‌లోని పూలతొట్టెలో నైట్‌క్వీన్ మొక్క.

అయిదు నిమిషాల్లో  మైత్రి లోపలికి వచ్చింది.

"దేవ్‌సేన్ రిపోర్ట్ గురించి నీకెలా తెలుసు?" అడిగాడు ఆమెని చూడగానే.

"మీ గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి ఏర్పడటం వల్ల. ఇదొక్కటేకాదు. నాకు మీ గురించి చాలా విషయాలు తెలుసు"

మైత్రి వంక ఆశ్చర్యంగా చూసాడు.

"అసలు నేను మీ దగ్గర ఉద్యోగానికి రావడానికి కారణం మీ గురించి అనేక విషయాలు తెలుసు కాబట్టే.. కేవలం ఉద్యోగం అవసరం అయేకాదు"

ఈసారి అతని ఆశ్చర్యం రెట్టింపయ్యింది.

"ఏమిటి నువ్వనేది?" అడిగాడు.

"ఇప్పుడు మీరు విన్నదే" నవ్వింది.

"సుధీర్ తండ్రెవరు?" అడిగాడు కొద్దిసేపాగి.

"బెనర్జీ" చెప్పింది మైత్రి.

ఆమె వంక చురుగ్గా చూసాడు. కొద్ది క్షణాలు అతని మొహం కోపం చవి చూసింది.

"అబద్దాలు చెప్పక. నేనీ జన్మకి తండ్రిని కాలేను"

"సరిగ్గా చెప్పాలంటే ఆరేళ్ళ క్రితం జూన్ ఆరునుంచి"

"నువ్వేం చెప్పాలనుకుంటున్నావో నా కర్థం కావడంలేదు"

"గతం మీకెంతదాకా గుర్తుంది" అడిగింది.

"ఏ గతం?"

"మనిద్దరికీ సంబంధించిన గతం."

"అంతా"

"నిన్న వదిలెయ్యండి. మొన్న మీరు ఆఫీసులో వచ్చిన ఫోన్ కాల్ ఒక్కటి గుర్తుతెచ్చుకుని ఎవరినుంచి వచ్చిందో చెప్పండి."

"దేనికి?"

"జస్ట్. చెప్పండి"

బెనర్జీ గుర్తు తెచ్చుకోవాలని ప్రయత్నించాడు. కాని విఫలం అయాడు.

"ఎందుకు గుర్తులేదో తెలుసా? మీ తల్లోని బ్రెయిన్ ఎక్కువకాలం ఆల్కహాల్‌లో నానుతోంది కాబట్టి. అంత డ్రింక్ అలవాటయిన వారికి మతిమరుపు వస్తుంది" చిన్నగా నవ్వింది.

బెనర్జీ మొహంలో కోపం.

"మీలో గతంలోని చురుకుదనం లేదు. మొహం ఎంత అసహ్యంగా మారిందో ఒకసారి పాత ఫోటోలు దగ్గర ఉంచుకుని చూసుకోండి. మీ పెళ్ళినాటి ఫోటో ఉదాహరణకి"

"అసలు విషయానికి రాక ఏవిటీ పిచ్చివాగుడు?" అసహనంగా అరిచాడు.

"అసలు విషయానికి ఇది నాంది"

"అంటే?" అడిగాడు.

"చిన్నగా నవ్వింది మైత్రి.

"చెపుతాను. అసలు నేనెందుకు మళ్ళీ మీ జీవితంలోకి ప్రవేశించానో చెపుతాను" చెప్పింది మైత్రి.

ఆమెవంక వింతగా చూస్తూ అడిగాడు.

"కావాలనా?"

"అవును"

"నాన్చక అసలు విషయానికిరా" చేతిలోని సిగరెట్‌ని నేల మీద కొట్టి గట్టిగా అరిచాడు బెనర్జీ.

మైత్రి లేచి సిగరెట్ మూలనున్న డస్ట్ బిన్‌లో పడేసి, నేల మీద రాలిన నుసిని డస్టర్ క్లాత్‌తో తుడిచి మళ్ళీ వచ్చి వళ్ళో చేతులు పెట్టుకుని కూర్చుంది.

అతని అరుపులకి కైలాసం దగ్గరకి వేసివున్న తలుపు తెరచి చూశాడు. మైత్రి ఆయన వంక చూసి చెప్పింది.

"ఇట్సాల్ రైట్."

ఆయన తలుపు మళ్ళీ దగ్గరికి వేశాడు. మైత్రి కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది గతం గుర్తుతెచ్చుకుంటూ.

"మీకారోజు గుర్తుందా?"

"ఏ రోజు?"

"మన దొంగ పెళ్ళయిన రోజు.. దొంగపెళ్ళని ఎందుకన్నానంటే, తర్వాత మా నాన్నగారు ఆ గుడికెళ్ళి చెక్‌చేస్తే అసలు మన పెళ్ళేకాలేదని తెలిసింది."

బెనర్జీ మొహం కొద్దిగా వివర్ణం అయింది. ఆమె ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

"ఇలాంటి విషయాల్లో విశ్వం మీకు కుడిమెదడు, ఎడమ మెదడు కూడా అవునా?" నవ్వింది.

బెనర్జీ అసహనంగా ఆమె చెప్పే దానికోసం ఎదురు చూడసాగాడు. ఎక్కడ మొదలుపెట్టాలా అని ఆలోచించసాగింది మైత్రి. బెనర్జీ ఇంకో సిగరెట్ వెలిగించాడు.

"మా నాన్నగారికి ఉబ్బసం వ్యాధి నయమై తిరిగి హైదరాబాద్ వచ్చేసాం.. బైదివే, థాంక్స్ ఫర్ ది ఫైనాన్షియల్ హెల్ప్"

బెనర్జీ శ్రద్ధగా వినసాగాడు.

"నేను జరిగింది మా సిస్టర్‌కి, నాన్నగారికి చెప్పాను. ఇద్దరూ నా మీద విరుచుకుపడ్డారు. డబ్బుకోసం అమ్ముడుపోయానని ఒకరు తిడితే, మోసపోయావని ఇంకొకరు తిట్టారు. కానీ నేను వాళ్ళ మాటలని నమ్మలేదు. అప్పుడది నమ్మే వయసుకాదు. పగలంతా వెలుగు, రాత్రంతా చీకటి అని నమ్మే రోజులు.."

కొద్దిక్షణాలు మౌనంగా ఉండిపోయింది మైత్రి.

"మా నాన్నగారు మీ దగ్గరకు వచ్చారు మీరు పెళ్ళికాలేదని అబద్ధం అని బుకాయించారు. అంతకుముందు రోజే మీకు వివాహం అయిందని నాన్నగారు చెప్పగానే నా గుండె బద్ధలయింది"

మైత్రి చెప్పడం ఆగింది.

"గో ఆన్" చెప్పాడు బెనర్జీ ఓ దమ్ము పీల్చి.

"మా నాన్నగారు జరిగింది చెప్పాక ఓ పట్టాన నమ్మలేక పోయాను. మీ ఆఫీస్‌కి వస్తే మీరు హానీమూన్‌కి వెళ్ళారని తెలిసింది. ఆత్మహత్య ఒక్కటే శరణ్యం అనిపించింది" మైత్రి చెపుతూంటే బెనర్జీ ఓ సిగరెట్ తాగుతూ వినసాగాడు.

●●●

మైత్రి చెప్పేది ఎంతో శ్రద్ధగా వింటున్న బెనర్జీకి గతం అంతా మళ్ళీ ఓసారి కళ్ళముందు పరిచినట్లయింది. మైత్రి చెప్పటం ఆపాక అతను ఎంతో నిశ్శబ్ధంగా ఉండిపోయాడు. క్షణకాలం అతనికనిపించింది. తనెంత ప్లేన్డ్‌గా, శ్రద్ధగా మైత్రిని వల్లో వేసుకున్నానా అని..

ఇద్దరూ కొద్దిసేపు గతస్మృతులతో మౌనంగా ఉండిపోయారు. శ్యామలాంబ ఇద్దరికీ స్టీలుగ్లాసుల్లో టీ తెచ్చి ఇచ్చింది. ఇచ్చేప్పుడు బెనర్జీ వంక పరిశీలనగా చూసింది. ఆవిడకి అతనిమీద కోపంగా ఉంది. ఆవిడకి మైత్రి నెలరోజులుగా తెలుసు. అంత మంచిపిల్ల తనకూతురో లేదా కోడలో అయివుంటే ఎంత బావుండేదో అని అనేకసార్లు అనుకుంది కూడా. అలాంటి మైత్రిని చంపే ప్రయత్నం చేసిన ఆ కొత్త వ్యక్తిమీద శ్యామలాంబకి సదభిప్రాయం ఎంత మాత్రం లేదు.

ఆవిడ వెళ్ళాక మైత్రిలేచి అల్మైరాలోంచి గ్లూకోజ్ బిస్కెట్ పేకెట్‌ని తీసి ఓ ప్లేట్‌లో వేసి అతని ముందుంచింది. బెనర్జీ ఓ బిస్కెట్‌ని అందుకున్నాడు.

టీ తాగాక అతను లేచి కిటికీ దగ్గరికి వెళ్ళి కొత్త సిగరెట్ అంటించుకున్నాడు. సిగరెట్ సగం కాలేదాకా కిటికీలోంచి బయటికి చూస్తుండిపోయాడు. తర్వాత సిగరెట్‌ని బయటకి గిరాటేసి వెనక్కి తిరిగి మైత్రివంక చూస్తూ అడిగాడు.

"ఇంతకీ డాక్టర్ దేవ్ సేన్ దగ్గరకి నేను వెళ్ళిన సంగతి నీకెలా తెలుసో చెప్పనేలేదు?"

బదులుగా చిన్నగా నవ్వింది. కాని ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు మైత్రి.

"నాకు అప్పుడు తండ్రి అయే అవకాశం ఉండి అకస్మాత్తుగా ఇప్పుడు అది లేకపోవడం ఏమిటి? నాకది అర్థం కాలేదు. నీకా విషయం అసలెలా తెలుసో అసలు అర్థం కాలేదు" చెప్పాడు బెనర్జీ.

మైత్రి తన చేతులని వళ్ళో పెట్టుకుని అతని వంక నిశ్చలంగా చూస్తూ చెప్పింది.

"మా నాన్నగారి డైరీని దాదాపు నెల్రక్రితం అనుకుంటాను చదివాను. అది చదివాక కాని నాకు ఆ రహస్యం తెలీలేదు"

"మీ నాన్నగారి డైరీలో ఈ రహస్యమా? తమాషాగా ఉందే"

"చదివాక నాకూ అలాగే అనిపించింది. నాకు తెలియని ఓ కొత్త నాన్నగార్ని చూసాననిపించింది"

బెనర్జీ ఆమె వంక ఆసక్తిగాచూస్తూ అడిగాడు.

"అందులో ఆయన ఏం రాశాడు"

"మీకారోజు మారేడ్ పల్లిలో కారు ఏక్సిడెంట్ అయి ఉండక పోతే మీ జీవిత కథ మరోలా ఉండేది" చెప్పింది మైత్రి.

"దానికి దీనికీ ఏమిటి సంబంధం?" అడిగాడు బెనర్జీ ఆశ్చర్యంగా.

●●●

బెనర్జీ జీవితంలోని విషాదానికి నాంది, మైకంలో ఉన్న మైత్రిని అనుభవించిన రాత్రయితే, అతని జీవితంలోకి అతనికి తెలియకుండానే విషాదం ప్రవేశించింది ఆ బుధవారం మధ్యాహ్నం.

అతనికి వివాహం అయి నాలుగు నెలలు దాటుతోంది. ఆ నాలుగు నెలలు అతనికి లిక్కర్ తాగే అవకాశం తక్కువైపోయింది. అతని భార్య అనసూయకి ఆ వాసన పడదు. పైగా కొత్త పెళ్ళాం అన్న మోజు. రాత్రుళ్ళు తాగే బదులు ఆ కార్యక్రమాన్ని మధ్యాహ్నంకి బదిలీ చేసుకున్నాడు.

మధ్యాహ్నం పన్నెండు నుంచి మూడు, మూడున్నరదాకా తాగి ఇంటికెళ్ళి భోజనం చేసి పడుకుని ఎనిమిదిన్నర తొమ్మిదికి ఫ్రెష్‌గా లేవసాగాడు.

ఆ రోజు డ్రింక్ తీసుకుని మధ్యాహ్నం కారుని మారేడ్ పల్లిలో నడుపుతూండగా అకస్మాత్తుగా అతని కంటి ముందు పక్క సందులోంచి వస్తున్న ఓ సైకిలిస్ట్ కనపడ్డాడు. అతన్ని రక్షించడానికి బెనర్జీ కారుని పక్కకి కోసాడు. వెనకనుంచి వస్తున్న లారీ, అతని మారుతిని లెఫ్ట్‌సైడ్ నుంచి ఓవర్ టేక్ చేయబోతుండగా ఈ సంఘటన జరిగింది. లారీ మారుతిని గుద్దేసింది. కారు పిప్పి అయిపోయింది.

స్టీరింగ్ వీల్ మీదకి తల వాల్చి ఉన్న బెనర్జీ మరణించి ఉంటాడనే అంతా అనుకున్నారు. కానీ అంతగా కారు పిప్పి పిప్పి అయినా బెనర్జీకి గట్టిదెబ్బలు తగలక పోవడం అతనికి ఇంకా ఆయువు మూడకపోవడమే అనుకున్నారు, కారులోంచి అతన్ని స్ట్రెచర్ మీదకి ఎక్కించిన అంబులెన్స్ వాళ్ళు.

లారీ డ్రయివర్, క్లీనర్ లారీని అలాగే వదిలేసి పరారయ్యారు. ఆ అంబులెన్స్ దగ్గర్లో ఉన్న హాస్పిటల్ వారిది. జరిగింది గమనించి ఎవరో వాళ్ళకి చెపితే, బెనర్జీని తమ హాస్పిటల్‌లో చేర్చుకున్నారు.

ఎడమచేతి మీద, నుదుట, కుడి తొడమీద మాత్రం బలమయిన గాయాలు తగిలాయి. అయితే అవి మనిషిని చంపేవి కావు. బెనర్జీ గాయాలకి కట్లు కట్టి ఏంటీ బయాటిక్ ఇంజెక్షన్స్ చేసారు.

అతనికి వెంటనే స్పృహ రాలేదు. వచ్చాక ఏక్సిడెంట్ వల్ల కలిగిన షాక్‌లోంచి వెంటనే తేరుకోలేకపోయాడు.

సంగతి తెలిసిన బెనర్జీ తల్లిదండ్రులు, భార్య, అత్తగారు, మామగారు హాస్పిటల్‌కి ఆదరా బాదరాగా వచ్చారు. అనసూయ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఎడం చేతిలో దిగిన గాజు పెంకులని మాత్రం మత్తు మందిచ్చి ఆపరేట్ చేసి తీసాసారు. డాక్టర్ డిశ్చార్జి చేయచ్చన్నా బెనర్జీని ఓ రోజు అదనంగా ఉంచాడు అతని తండ్రి.

డిశ్చార్జి అయాక బెనర్జీ గాయాలు పదిహేను రోజులదాకా మానలేదు. కారు పోతే పోయింది. మనిషి దక్కాడని సంతోష పడ్డారు బంధుమిత్రులంతా!

●●●

మైత్రి లేచి అలమారలోంచి ఓ పాత డైరీని తీసి బెనర్జీకి అందించి చెప్పింది.

"ఇది మా నాన్నగారి డైరీ. మీ ఏక్సిడెంట్ జరిగిన రోజు ఆయన అందులో ఏం రాసారో చదువు."

ఆ డైరీ తెరిచాడు. మొదటి పేజీలో ఆ డైరీ ఎవరిది, చిరునామాలాంటి వివరాలు రాసి ఉన్నాయి. ఆ డైరీ ఎవరిది, చిరునామా లాంటి వివరాలు రాసి ఉన్నాయి. ఆ డైరీ మొత్తం ఖాళీగా ఉంది. ఆగస్ట్ పద్దెనిమిది మినహా.

అందులో తెలుగులో రాసివున్న వాక్యాలని నెమ్మదిగా చదవసాగాడు బెనర్జీ. కలిపిరాతతో ఉన్న ఆ తెలుగు పెద్దవాళ్ళ చేతి వ్రాతని ఇట్టే గ్రహించవచ్చు.

'ఈ రోజు ఉదయం ఎప్పటిలానే హాస్పిటల్‌కి వెళ్ళాను. మధ్యాహ్నం భోజనం చేయడానికి టిఫిన్ బాక్స్‌ని విప్పబోతుండగా డాక్టర్ నుంచి కబురు వచ్చింది. ఏక్సిడెంట్‌కి గురయిన ఓ పేషెంట్ అడ్మిట్ అయాడని, అతనికి చికిత్స చేయడానికి వెంటనే రమ్మని.

పేషెంట్ గాయాలని పరీక్షించిన డాక్టర్ చెప్పాడు.

"లక్కీగా ఫేటల్ ఇన్‌జరీస్ ఏం లేవు. బ్లడ్ మాత్రం పోయి ఉంటుంది. వెంటనే ఎక్కించాలి. నువ్వు బ్లడ్ గ్రూప్ టెస్ట్ చేయి" అన్నారు.

ఐ గాట్ ది సెకండ్ షాల్ ఆఫ్ మైలైఫ్. నా కూతురికి జరిగిన అన్యాయం గురించి తెలిసాక నాకు తగిలిన షాక్ తర్వాత ఇది పెద్ద జోల్ట్. నా కూతురికి జరిగిన అవమానానికి, అన్యాయానికి నా హృదయం మండిపోతున్న ఈ సందర్భంలో బెనర్జీ పేషెంట్‌గా చేరడంతో 'ప్రతీకారం చేసే అవకాశం నాకు లభించింది' అన్నది నా మొదటి ఆలోచన.

అతని బ్లడ్ గ్రూప్‌ని టెస్ట్ చేశాను. బెనర్జీలాంటి నరపశువు ఈ భూలోకంలో ఉండకూడదు. అతన్ని చంపాలి అన్న నిర్ణయం అప్పటికప్పుడే తీసుకున్నాను, నేను జైలుకి వెళ్ళినా సరే.

బ్లడ్ గ్రూప్ తప్పు చెప్పి వేరే గ్రూప్ రక్తం ఎక్కించడం ద్వారా అతన్ని చంపవచ్చనుకున్నాను. లేదా వేరే గ్రూప్ రక్తం మీద తని గ్రూప్ రక్తం లేబిల్ అతికించాలనుకున్నాను. లేదా అతనికి ఏ విషమో ఇంజెక్ట్ చేయాలనుకున్నాను. మెడికల్‌గా, అది హత్య అనిపించకుండా ఎలా చంపాలో రకరకాల ఆలోచనలు చేసాను.

కానీ గంటదాకా ఏమీ చేయలేకపోయాను. బ్లడ్ గ్రూప్ విషయంలో అబద్ధం ఆడాలనుకున్నాను. కానీ అది నావల్ల కాలేదు. అలాగే బ్లడ్ బాటిల్స్ మీద లేబుల్స్ మార్చడం. ఓ మనిషిని, నా కూతురికి ఎంత హాని చేసిన వ్యక్తయినా సరే, నా చేతులతో చంపడం నాకు సాధ్యం కాదని తెలుసుకున్నాక, నా మీద నాకే కోపం వచ్చింది.

కానీ నా పగ అలాగే ఉంది. అది చల్లారడం ఎలా? నా బంగారు తల్లిని నమ్మించి, వంచించి, నాశనం చేసిన దుర్మార్గుడిని శిక్షించడం ఎలా? ఆ ఆలోచన ఆ రాత్రి వచ్చింది నాకు.

అదే సబబనిపించింది. అంతేకాదు, అది నాకు కొట్టిన పిండి. రాత్రి బెనర్జీకి భోజనం పెట్టలేదు. మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు వాంతవుతుందని.

అర్ధరాత్రి బెనర్జీకి మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్ళాను. చాలా సింపుల్, మైనర్ ఆపరేషన్ అది. బెనర్జీకి వేసెక్టమీ ఆపరేషన్ చేసేసాను!

నాకెంతో సంతోషం వేసింది. పెళ్ళి చేసుకున్నానని వంచించి గర్భవతిని చేసి నా కూతురి జీవితాన్ని నాశనం చేసిన బెనర్జీకి ఎప్పటికీ పిల్లలు పుట్టకుండా చేయడం సరయిన న్యాయం అనిపించింది. అలాంటి దుర్మార్గుడి సంతతి భూమి మీదకి వస్తే వాళ్ళు అలాగే రాక్షసుల్లా ప్రవర్తించవచ్చు. అసలు సంతతే లేకుండా చేయడం పొయిటిక్ జస్టిస్ అనిపించింది.

వేసెక్టమీ ఆపరేషన్ లోని మరో విషయం ఆ ఆపరేషన్ అయిన గంటకి ఇంటికి నడిచి వెళ్ళిపోవచ్చు. ఆ ఏక్సిడెంట్ వల్ల బెనర్జీకి ఎలాంటి అనుమానం రాదు. అన్ని శారీరక బాధలు ఏక్సిడెంట్ వల్లే అనుకుంటాడు. మూడో కంటికి తెలీకుండా సక్సెస్ ఫుల్‌గా నా పగ తీర్చుకున్నాను.

ఈ రోజు నా మనసు శాంతించింది'

డైరీలో సుబ్బరామయ్య రాసింది మొత్తం చదివేకొద్దీ బెనర్జీ మొహంలో క్షణక్షణానికి ఎన్నో మార్పులు. ముఖ్యంగా అతను ఆఖరి పేరాలు చదివేటప్పుడు అతని మొహంలో కనిపించే మార్పులను మౌనంగా చూస్తూండిపోయింది మైత్రి.

పూర్తిగా చదివాక జేబులోంచి రుమాలు తీసి నుదుటికి పట్టిన చిరు చెమటని తుడుచుకుని మైత్రి వంక చూసాడు బెనర్జీ. అతని మొహం కత్తివాటుకి నెత్తురు చుక్క కారనంతగా తెల్లగా పాలిపోయింది. ఎంతో హుషారుగా, ఉత్సాహంగా ఉన్న మొహం ఒక్కసారి జీవకళ తప్పినట్లయింది.

లేచి, డైరీని కుర్చీమీద పెట్టి ఏదో మాట్లాడటానికి నోరు తెరిచాడు. కానీ అతని నోరు పెగిలి మాట బయటకి రాలేదు. కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడి వణికే చేతులతో జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి, సిగరెట్ అంటించాడు. గబగబ రెండు సార్లు పొగపీల్చి వదిలాడు.

***

*(ఇంకా ఉంది)*

Post your comments